దీపావళి కథల పోటీలో పాఠకుల నిర్ణయానికై ఎంపిక చేసిన కథ

# సేయితం




**రా**త్రంతా రాలిపడిన చుక్కలను పక్కకు తోసి నొసట కాసంత వెలుగు చుక్కతో ఉషఃకాంత లోకం లోగిలిలోకి తొంగి చూస్తుంది. కోడి కుయ్యకముందే లేచే నరసయ్య ఇవ్వాళ ఎందుకో ఆలస్యంగా లేచి, అన్నం తిని, బయటకు వచ్చేసరికి గుడికాడ గుంపు కనపడింది. వచ్చేవాళ్ళు వస్తుంటే పొయ్యేవాళ్ళు పోతున్నారు. ఏందో చూద్దామని నరసయ్య కూడ వెళ్ళాడు.

గుడిముందర అరుగుమీద మల్లయ్య వాగులో కొట్టుకొచ్చిన మనిషిలా కూర్చొని ఉన్నాడు. వాడిచుట్టూ ఆబాలగోపాలం దడి కట్టి తలా ఒకమాట చెప్తున్నారు. ముందున్న ముసలాయన "ఊరుకో నాయన ఊరుకో, మనిషికిరాక మానుకొస్తాయా కష్టాలు" అంటూ ఊరడిస్తున్నాడు.

# కన్నీరోమరి పన్నీరో

కాలం ఓ మాయాజాలం
అదీ అంతుచిక్కని ఇంద్రజాలం
నిరంతరం ప్రవహించే మహాసాగరం
అగాధాలూ అత్యున్నత శిఖరాలు
మైదానాలూ మైలురాళ్ళు
ప్రవాహ క్రమంలో...
హత్తుకుంటుంది చిత్తు చేస్తుంది
కత్తులు దూస్తూనే చిరుజల్లులూ చిలుకరిస్తుంది
ఓ చేత్తోగాయాలను రగిలిస్తూనే
మరోచేత్తో మలాం పూస్తుంది

ఆక్షేపిస్తుందో ఆశీర్వదిస్తుందో
చేరదీస్తుందో దూరం కొడుతుందో
కరచాలనం చేస్తూనే సుడిగుండంలో తోస్తుంది
కన్నీరారందే పన్నీరు జల్లుతుంది
దూకేజలపాతాలను ఆపేది
బండ గుండెలను మంచుకొండలుగా
బళ్ళను ఓడలుగా మార్చేది
మాయదారి కాలానికే సొంతం
రేపటి ఆశలతో రెక్కలు పూయిస్తూ
రేకులు చిదిమి చీకటి చేస్తుంది
నిశీథిలో దివిటీ పట్టి
విధిరాతంటూ విసిరికొడుతుంది
వెన్నెల వెంటే లావాను
వెలుగు వెంటే చీకటిని తెస్తుంది
ఓ పట్టాన అంతుపట్టదు
కాలచదరంగంలో పావులం
గాలికిపోయే బుడగలం

**- నాంపల్లి సుజాత**

"ఇది కొని తెచ్చుకొన్న కట్టం మావా. బుడ్డన్నమ్ముకొని యేట్లో దిగినట్లు, దాని నమ్ముకొని ఇల్లు వాకిలి అన్ని అమ్ముకొని పోతినే" గుడ్ల మీద నీరు పారాడుతూ వుంది.

ఇంతలో దగ్గరకు వచ్చిన నరసయ్యను చూసి మల్లయ్య దుఃఖం ఆపుకోలేక బావురుమన్నాడు. అసలేందిరాకత? అడిగాడు నరసయ్య అర్థంకాక.

'మా బానేలి' నన్ను తట్టి తరమిందన్నా. అత్తామామలు చితక్కొట్టి అర్ధరేతిరికాడ బయటకు తోసారన్నా. మాటపూర్తికానే లేదు; నరసయ్య ఉగ్రుడయ్యాడు, "చెప్పుతో కొడ్తా, నాయాల" అన్నాడు గట్టిగా. మల్లయ్య దుఃఖం మధ్యలోనే ఆగిపోయింది. అందరు బిత్తర పోయారు. "ఆడ బిడ్డలకు దూరమై వాడు యేడుస్తుంటే, ఈడికేం పొయ్యేకాలం ఇట్లా మాట్లాడతాడు, అని జనం గొణుక్కుంటూ ఉంటే, మళ్ళీ అందుకొన్నాడు నరసయ్య" యెందుకురా యేడ్చేది? అదిగాకపోతే దానెమ్మ ఇంటికొకటయింది. కాళ్ళు, చేతులు లేనోళ్ళే కమ్మగా బతుకుతుంటే అన్ని ఉండేవాడివి నీకెందుకు యేడుపు? కండలు కోస్తే బండికైతయి. నీకు మీసం, రోసం లేదంట్రా'.

"అదికాదన్నా, నాభార్య బిడ్డలు..." అన్నాడు నసుగుతూ. మధ్యలోనే అందుకున్నాడు నరసయ్య. కావాలంటే రేపు పొద్దుగూకే లోపల బల్లి పద్దలాంటి పిల్లను దెచ్చి పెండ్లి చేస్తా. మూడేండ్లకు ఇద్దరు పిల్లలు. నీ భార్యా పిల్లలను చూసి దానికి కళ్ళు మండి వంటి మీద గబ్బునూనె పోసుకొని అరిసిచావాల.

వాళ్ళు ఎట్లా చస్తే మనకేంగాని ముందు వీడు బతికే మార్గం చూడాలి" అన్నాడు నెంబరు వెంకటయ్య.

"ఏంది పెద్దయ్యా, అట్లా చెప్తవు. మనమందరం చచ్చినామా యేంది. వాడెవరు నాసిన్ననాటి సావాసగాడు. నేనుండగా వాడికి దిగులేంది!' అంటు 'రారా' అని మల్లయ్యను చెయ్యి పట్టుకుని గుంజుకపోయాడు నరసయ్య.

'ఈ నరిసిగాడికి ఏదొచ్చిన పట్టలేం. ఆగ్రహం వచ్చినా అంతే. అనుగ్రహం వచ్చినా అంతే అన్నాడు నెంబరు వెంకటయ్య. 'నోర్దు తెరిస్తే బూతు తప్ప వాడికి మాటరాదుగా' అన్నాడు పిచ్చయ్య పంతులు.

"నోరు చెడ్డదే గాని" మనసు మంచిది. మనందరం సలహా చెప్పేకాదుంటె, వాడు వెనకాముందు చూడకుండా తోడబుట్టినోడి మాదిరి లాక్కుపోయాడు" అన్నది మరొక పెద్దావిడ.

ఇంట్లో కెళ్ళకుండానే చెంచులను కేకేస్తాడు నరసయ్య. ఒసేయి పిల్లా! ఈడెవరో తెలుసా? ఈడు నా పేన సేయితుడే. మన పెళ్ళైన కొత్తల్లో చూసుంటావు. మేమిద్దరం సిన్నప్పుడు బర్రెలు కాస్తూ ఒక సెరువుల్లో దూకేవాళ్ళం, ఒకే సద్ది తినేవాళ్ళం. ఈడు బలె దొంగనాయాల్లే. ఎప్పుడో ఏయరకాన్నో యాదమరిపించి బత్తాకాయలు తెచ్చేవాడు. ఒకరోజు కనుక్కొని ఇద్దరిని అదరకొట్టింద్రా".

"మరి ఇప్పుడుదాక యాడ ఉన్నడీయన్న" అడిగింది చెంచమ్మ. "యాన్నా, వల్లకాట్లో. వద్దురా అంటే వినకుండా ఎర్రపిల్ల దొరికిందని ఇల్లరికం పోయిందు. వాళ్ళు యిరగదన్ని ఇంటికి పంపించింద్రు".

"యెప్పుడు తిన్నావోయేందో, బువ్వ తిందువురాన్నా' అన్నది చెంచమ్మ. పీక్కుపోయిన మల్లయ్య మొఖం చూచి. "ఇప్పుడొద్దులే అక్కా కాసేపాగి తింటా".

"అందుకేరా నాకు వళ్ళు మండేది. మొగం కడుక్కోరా ముండ నాయాలా అంటే ముంగిలా కూర్చుంటావేందిరా. యెవరో చచ్చి నట్లు యేడుపెందుకు? దిట్టంగా తిని పట్టు దలగా పనిచేసుకోక".

నరసయ్య చేత తిట్లు తినేకంటె బువ్వ తినడం మేలని మల్లయ్య ముఖం కడుక్కొని, పళ్ళెం నిండా మజ్జిగన్నం కలుపుకొని మూడు గుక్కల్లో లాగేసరికి ముఖంలోకి కళొచ్చింది.

"ఇప్పుడురా మల్లిగా సక్కగా ఉండావు' అన్నాడు సంబరపడుతూ నర్సయ్య.

మల్లయ్యేకాదు, ఎవరైన వేళ పొద్దున కనపడితే" బువ్వ తినిపో" అంటాడు. "ఇప్పుడొద్దులే" అని బిడియపడితే వాడికి కోపం నసాళానికంటుద్ది. 'ఇలా ఎచ్చులు పడే పెద్దచ్చి కాపురం చెడింది. మద్దేనేలయింది. ఎచ్చులు పడకుండ పెట్టింది తినిపో" అంటూ వాడు తినేదాక తిడుతూనే ఉంటాడు.

గుమ్మడి పువ్వులా చెంచమ్మ, గుమ్మడి పిందెల్లా పిల్లోళ్ళు, గుమ్మడి పాదులా సంసారం అందంగా, పొందికగా వుంది నరసయ్య కాపురం. నరసయ్యను గురించి, నరసయ్య నోటిని గురించి నలుగురు నాలుగు రకాల అనుకొనే వాళ్ళే కాని వాడి మనసెరిగిన వాళ్ళు చాలా తక్కువ. కోడికుయ్యకముందే లేచి ఊరు మాటు మణిగిన తర్వాత పడుకొనేవాడు. పనిలో దూరితే ఆకలి దప్పులు గుర్తుకురావు. మేడిపట్టు కుంటె ఎద్దుకొమ్ముల మీదికి పొద్దు వచ్చేదాక వదలే వాడు కాదు. పనే జీవితపరమావధిగా, పనే ఒక పూజగా భావించేవాడు.

పని మొదలుపెడ్తే తను ఒక నిముషం ఊరుకోడు. ఇతరులను ఊరుకోనియ్యడు. విత్తనం గొర్రుపడ్తే పంచె తొలగిదీసి పొయ్యవలసిందే గాని అరక ఆపి పక్కకు వెళ్ళేవాడు కాదు. వెనుక విత్తనం వేస్తున్న భార్య మొఖం పక్కకు తిప్పుకొని పక్కకు సావరాదా, ఎవరైన చూస్తే సిగ్గు పోద్ది," అంటే! ఏందే, కొత్తగా చూసినట్లు సిగ్గుపడతావు, ఎప్పుడు ఎరిగిన బాగోతమే కదా, అంటాడు. ఈడితో మాట్లాడడమే బుద్ధి తక్కువ అని నోరు మూసుకొనేది. ఊర్లో కూడ అంతే. తియ్యగా చెప్పాలన్నా తిట్టంది చెప్పలేదు. ఆదరంగా చూడాలన్నా అరవంది కుదరదు. ఆప్యాయత చూపాలన్నా అపాయం వచ్చి పడ్డట్లే.

ఒకసారి వరుసకు మేనకోడలైన పిల్లతో పిల్ల బాగా సంకజేసిందే. ముర్రు మీదున్న పోట్లగిత్తను పట్టుక రావాల్సిందే' అన్నాడు మురిపెంగా. పిల్ల తల్లి గయ్యన లేచింది. నాబిడ్డ నీకు గొడ్డులా కన్పడుతుందారా, సంకజేసిందం టావు, అంటూ తగవు పెట్టుకొంది. పిల్ల పెళ్ళి కెదిగింది, తలుగు పెట్టమనక్కా నా అర్థం" అన్నాడు. 'నాయనా నరసయ్యా నీకొకదండం అర్థాలు పర్థాలు వొద్దుకాని నా బిడ్డ జోలికి మాత్రం రాకు' అంది నిష్ఠూరంగా.

నరసయ్య నిద్రపోయేటప్పుడు తప్ప మిగతా టయమంతా ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. ఏటా వ్యవసాయం మీద అన్ని ఖర్చులు పోను, లక్ష, లక్షన్నర మిగులుతూనే ఉంటాయి. ఆ మిగులు యేం చేస్తాడో తెలియదు. ఇల్లు కట్టడు, పొలం కొనడు. ఉన్నది చాల్లే అంటాడు. సంపాయించిందంతా ఏమి చేస్తున్నావు అంటె నా దగ్గరేముంది, గొట్టం, కొబ్బరిపీచు తప్ప, అంటాడు. ఊరందరికి ఇది లక్షడాలర్ల ప్రశ్న అయింది. ఆఖరుకు తేలిందేమంటే వాడి చిన్నప్పటి స్నేహితుడు, శెట్టిగారి పిల్లోడు పట్నం చేరి బంగారు కొట్టుపెట్టాడు. ఇల్లు, పొలం అందరికంట పడుతుంది. బంగారం అయితే గుట్టుగా దాచి పెట్టుకోవచ్చు" అని సలహా చెప్పాడని, ఆ సలహా మేరకు డబ్బంతా బంగారు బిస్కెట్ల రూపంలో దాచి పెట్టుకుంటున్నట్లు ఒక వదంతి మాత్రం వచ్చింది గాని వస్తువు చూచిన వారు మాత్రం లేరు. మాయలపకీరు ప్రాణాన్ని కనుక్కొన్నారు కాని నరసయ్య నిధి మాత్రం ఎక్కడుండేది తెలియడం లేదు.

వరినాట్లకు పోతూ వరుసైన పడుచుపిల్లలు "కొండ మీద దొంగలున్నా రంటమావా! నీబోసానం జాగ్రత్త" అంటే 'తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరవు' అంటూ నరసయ్య కథ మొదలుపెట్టాడు. వెనుకటికొక పిల్లోడు వాళ్ళవ్వ దగ్గరికి వెళ్ళి, చొక్కా పైకెత్తి "అవ్వా బూసే" అన్నాడట. అవ్వ నవ్వి "మీ తాత ఇంత లావు బూసికే నేను భయపడలేదు, నీ పిల్ల బూసికి నేను భయపడతానా' అన్నదంట. కన్నె పిల్లలంతా మొగ్గలు విచ్చుకున్నట్లు నవ్వుతూ ఉంటె, బుగ్గ మీద వేలేసుకున్న ముసిల్ది వాడొట్టి అల్లటప్పోడు. వాడి జోలెందుకే మీకు' అన్నదట ఉక్రోషంగా.

'ముసలిదానికి రోసమొచ్చినట్లుందే, ముసలిదాన్ని పట్టుకొని వసంతమాడినట్లు నీతో ఎందుకత్తా నాకు సరసం. అయినా నీకు మనుమడు లేడుగా' అన్నాడు నరసయ్య. నాకు లేకుంటేమి? నీ కొడుకులు నాకు మనమళ్ళు కాదంట్రా' అంది ముసలమ్మ. అయితే వాళ్ళ మీద కన్నేసినావన్న మాట' అన్నాడు నరసయ్య. పడుచుపిల్లలంతా పడీపడీ నవ్వుతుంటే ముసలమ్మ ముఖం అసురసంధ్యలా ఎర్రబారింది.

తదాస్తు దేవతన్నారన్నట్టు ఒకరోజు రాత్రి నరసయ్య ఒంటరిగా ఉండడం చూసి పది మంది దొంగలు ఇంట్లో దూరి నరసయ్య ఒళ్ళు, ఇల్లు అంగుళమంగుళం గాలించారు. బంగారు బిస్కెట్లు కాదుకదా, కుక్క బిస్కెట్లు కూడా దొరకలేదు. నర్సయ్య కట్టేసి, చెప్పరా నర్సిగా! చెప్పకుంటె నిన్ను నరికి పోగులు పెడతాం" అన్నారు. వాడు ఎన్.టి.ఆర్.లా నవ్వి నాదగ్గరేముంది, బూడిద' అన్నాడు. ఆఖరుకు అలసిపోయి 'చెప్పరా నాకొడకా! నీకాళ్ళు



సెప్టెంబర్ 2,2007 న తిరుపతిలోని అంబేద్కర్ భవన్‌లో 39 మంది కథా రచయితల కథా సంకలనం 'రమణీయ కథలు' ఆవిష్కరణ జరిగింది. చిత్రంలో ఎడమవైపు నుండి వరుసగా నాదెండ్ల శ్రీమన్నారాయణ, ప్రముఖ రచయిత నరేంద్ర, తి.తి.దే. శ్వేత డైరెక్టర్ భూమాన్, సంకలనం ఎడిటర్లలో ఒకరైన రాచపూటి రమేష్, రచయిత రాసాని వున్నారు.

# ఆమె

1. ఆమె చూసింది
నాకిపుడు కవిత్వం
కొత్తగా ఉంది !

2. మౌనరాగాల్ని
స్వరపరచి ఆమె
ఎటు వెళ్లింది ! ?

3. ఆమె చేరాక
నేను సగమేనని
తెలిసొచ్చింది.

4. ఆమె నల్లని
కన్నుల్ని అడగాలి
దాచుకొమ్మని

5. ఆమె నాకొక
అనునయ నయని
అంతర్వాహిని

6. ఆమె నాకొక
ప్రాణమిచ్చే పల్లవి
స్నేహ గీతాన్ని.

– పి. మోహన్‌రాంప్రసాద్

పట్టుకుంటాం. 'పదిమందిమెచ్చాం. కూలి కూడ పడ్లేదు' అన్నారు జాలిగా.

వాడు పకపకనవ్వి "యెర్రి నాయాల్లులే అని జాలిపడి ఊరుకున్నా. నేనుగ్గాని ఒక్క ఈలగాని వేసినానంటే వందమంది వాల్తారు. మీ తోలువల్చి ఆరేస్తారు. నామాట విని బుద్ధిగా వెళ్ళిపోండి" అన్నాడు. 'ఇప్పుడు కాదులే వీడిపని' అంటూ చెవులు కొట్టుకుంటూ వెళ్ళిపోయారు.

దొంగలకేకాదు ఊర్లో వారందరికీ ఇదొక చిదంబర రహస్యంగా మిగిలిపోయింది. చేదించే దొర దొరికితేగాని వాస్తవం బయట పడదు. ఎంతోమంది ఏదో పనిమీద వెళ్ళి ఇల్లంతా కళ్ళతో వెతికి, సర్వేంద్రియాలతో శోధించినా అది అందని బ్రహ్మ పదార్థంగా ఉండిపోయింది. ఆ పరబ్రహ్మ తత్త్వాన్ని సాధించే సిద్ధయ్య ఎక్కడున్నాడో, ఎప్పుడొస్తాడో తెలియదు.

మల్లయ్య నరసయ్యతో పాటు పనికి పోతూ వచ్చిన కూలీ కూడ బెట్టుకుంటూ, కూడు మాత్రం నరసయ్య ఇంట్లో తింటూ, నాలుగు రాళ్ళు వెనకేసుకున్నాడు. కూటిఖర్చు యిస్తానంటె వాడు తీసుకోడు. పైగా సేయితున్ని నన్ను చిన్న బుచ్చుతావంట్రా – అంటు గొంతుపట్టు కొంటాడని భయం.

నాలుగు నెలలు గడిచేసరికి ఉద్దర కూడుతో మల్లయ్య పోలేరమ్మకు యిడిసిన పొట్టేల్లా తయారయినాడు. చేతిలో నాలుగు వేలున్నాయి. ఈ సంగతి కర్ణాకర్ణిగ విన్న ఆలుబిడ్డలు, అత్తమామలు అప్పుడప్పుడు రాయభారాలు పంపడం మొదలుపెట్టారు. మొట్టమొదట బుసలుకొడ్తూ, బిగుసుకున్నా, రానురాను సళ్ళు వదలి మమకారం పొంగడం మొదలు పెట్టింది. వంట్లోకి కొత్తరక్తం చేరేసరికి, నరాలు జివ్వుమని పెళ్ళాం లేకుంటే బతకలేనని అన్పించింది మల్లయ్యకు.

మల్లయ్య యేడని, పొద్దుకూకేటప్పుడు గుర్తు చేసుకున్నారు నరసయ్య దంపతులు. ఎక్కడికో పోయుంటాడు, పొద్దునికి వస్తాడులే అని సరిపెట్టుకొన్నారు. మరునటిరోజు సాయంత్రానికి కూడ మల్లయ్య జాడలేదు. 'వీడు ఏమయ్యాడబ్బా' అని నరసయ్య ఆలోచిస్తూ, గబుక్కున గుర్తుకు వచ్చి గుప్తధనం కోసం వెతికాడు. నోరు తెరుచుకొన్న ఖాళీ డబ్బా కనబడింది. ఎర్రమూట అంతులేదు.

నరసయ్య వళ్ళు చల్లబడింది. మెదడు మొద్దుబారింది. ఒక్కసారిగా పాతికేళ్ళ పైన బడ్డట్లు నరసయ్య డీలాపడిపోయాడు.

మబ్బులో మెరుపులా మెదడులో ఒక వెలుగు వెలిగింది. పైన కండువ వేసుకొని రాత్రికి రాత్రే పోయి అత్తగారింట్లో మల్లయ్యను పట్టుకొన్నాడు. 'ఏందన్నా వచ్చావు?' అన్నాడు నవ్వుతూ మల్లయ్య. ఈ ముండనాయాలు ఎంత మారిపోయ్యాడు అనుకున్నాడు నరసయ్య. వాన్ని ఊరు చివరున్న బడి మిద్దెలోకి పిలుచుకుపోయాడు.

మబ్బుల చాటునుండి తొంగి చూస్తున్న చంద్రుడు కీచురాళ్ళ శబ్దం. వాతావరణం అంత ప్రశాంతంగా లేదు.

"ఒరే మల్లిగా! ఇంతవరకు ఎవ్వరికి అంతుబట్టని ఆరహస్యం నీకెట్లా తెలిసింది?" అడిగాడు నరసయ్య, అనవసరంగా సాగదీయకుండా, నేరుగా విషయంలోకి వస్తూ.

మల్లయ్య కూడా అందుకు సిద్ధంగానే ఉన్నాడు. వాడేమి అబద్ధం చెప్పి తప్పించుకోవాలని అనుకోవడం లేదు. నర్సయ్యకాదు, నర్సయ్యను పుట్టించిన దేవుడొచ్చినా తాను దాచిన తావు తెల్సుకోలేడు. పైగా తను తెచ్చినట్లు సాక్ష్యం గొంతుకోసుకున్న దొరకదని వాడి నమ్మకం. అందువల్ల నిజం చెప్పినా ప్రమాదం లేదని నిర్భయంగా చెప్పాడు. "మొన్న గురకపెట్టి నిద్రపోతుంటె తలుపు దగ్గర చప్పుడైంది. వెంటనే మెలుకువ వచ్చింది. తలుపు గడియ క్రింద టకటకమనే శబ్దం. ఆ మరుసటిరోజు తట్టి చూస్తే ఓటిమోత. ఇదే గండికోట రహస్యమనుకొన్నా. మొత్తం మీద 8 బిళ్ళలు. దేశమందరిని మభ్యపెట్టిన మేథావిరా నరసన్నా. తాడితన్నేవాడి తల దన్నేవాడుంటాడని తెలుసుకోలేకపోయావు. తెలివి నీ ఒక్కడి సొత్తేకాదు. కాస్త కళ్ళు తెరచుకొని నడుచుకో, ఇప్పుడైనా" అన్నాడు ధీమాగా మల్లయ్య.

నరసయ్య మెల్లగా అడిగాడు, "ఇట్లా తెచ్చానని ఎవరితోనైనా చెప్పావారా?" నర మానవునికి తెలియదన్నా" అన్నాడు మల్లయ్య.

"ఒరేయి మల్లిగా! తల్లిలా బువ్వపెడితే ఆలి అని చెయ్యి పట్టుకున్నావు. అన్నతమ్ముడిలా చేరదీస్తే దాయాదిలా దగాచేశావు. సేయి తుడవమని చెయ్యి అందిస్తే ఆ చెయ్యినే నరికేశావు" నరసయ్య గొంతు బొంగురుపోయింది. మల్లయ్య కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు". నువు మోసం చేసింది నన్ను కాదురా, సేయితాన్ని. ఈ విసయం తెలిస్తే నిజాయితీ అయిన సేయితుడికి కూడా సాయం చేయడానికి ఏ సేయితుడు ముందుకురాడు" మల్లయ్య రెండు చేతులు పట్టుకొని నరసయ్య అన్నాడు" ఓరేయి మల్లయ్యా, నాకొక మాటియ్యరా! ఈ విషయం

ఎవ్వరికి చెప్పకు. ఎందుకంటే ఈ లోకంలో సేయితం చచ్చిపోయిందిరా" మల్లయ్య చేతులు వదిలేసి తలవొంచుకొని ఇంటిదారి పట్టాడు నరసయ్య.

ఇప్పుడు నరసయ్య మనసు ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షిలా ఆనందంగా ఉంది. పెద్ద బరువేదో తలమీది నుండి దించి నట్లుంది. పుచ్చపువ్వులాంటి పండు వెన్నెల. ఒంటిని పలుకరించి పులకరింపజేసే పైరుగాలి. ఎంత హాయిగా ఉంది! అనుకున్నాడు నరసయ్య.

ఇంటికి చేరి చెంచమ్మతో "ఇంక మనకు దిగులు లేదే. నిశ్చింతంగా నిద్రపో" అన్నాడు నరసయ్య. చెంచమ్మకేమీ అర్థం కాలేదు. మొగుడెందుకో మహా ఆనందంగా ఉన్నాడనేది మాత్రం అర్థమైంది.

'అప్పుడే తెల్లవారిందె' అంటూ చెంచమ్మ ఆవులిస్తూ లేచి తలుపుతీసింది. వాకిటి కెదురుగా ఎర్రగుడ్డలో కట్టిన చిన్నమూట. ఏందీ! ఇది ఇక్కడ ఉంది అంటూ ఆత్రంగా వెళ్ళి భర్తను లేపింది. నరసయ్య లేచి ఎదురుగా పార చూశాడు. గాటిలో నుండి లేచి మల్లయ్య మెల్లగా వెళ్ళి పోతున్నాడు, కళ్ళు తుడుచుకుంటూ.

## వారసత్వ సంచయం

ఒక తరం
అప్పుల తప్పుల అవమానాల భారాన్ని
మరోతరం ఉసూరుమంటూ మోస్తున్నది

ఒక తరం బానిసభావాల్ని
మరోతరం
వారసత్వ సంపదగా భావిస్తున్నది

ఒకతరం దారుణాలకు
మరోతరం మరుభూమిగా మారుతున్నది

ఒకతరం స్వేచ్ఛాకాంక్షల్ని
మరోతరం దిక్కూచిగా స్వీకరిస్తున్నది

ఒకతరం మొక్కవోని పోరాటపటిమను
మరోతరం
జయకేతనంగా ఎగురవేస్తున్నది

**- జీవన్**

# తెలుసుకుందాం....

## ఈ నెల క్విజ్

1. తస్లీమానస్రీన్ రచించిన 'శోధ్' పుస్తకాన్ని 'చెల్లుకుచెల్లు' అనే పేరుతో తెలుగులోకి అనువదించిన రచయిత్రి ఎవరు ?

2. లేజర్‌ను కనుగొన్నది ఎవరు ?

3. 1956లో తయారైన రోజన్ ఎంటర్‌ప్రైజెస్ జపాన్‌వారు రూపొందిన తొలికంప్యూటర్ గేమ్ సృష్టికర్త ఎవరు?

4. మనిషి జీవకణంలోని డి.ఎన్.ఎ. పొడవు ఎంత?

5. సూర్యుని నుంచి వచ్చే ఏ కిరణం వలన భూమి వేడెక్కుతుంది ?

6. విమానాలు పైకి ఎగరడంలో గల సిద్ధాంతాన్ని ఏమంటారు ?

7. భారత మాజీ హాకీ కోచ్ 'మిర్ రంజన్ నేగి' జీవితం ఆధారంగా నిర్మించిన తాజా బాలీవుడ్ చిత్రం ఏది ?

8. ఒరిస్సాలో ఆంధ్ర క్యాడర్‌కు చెందిన ఐ.ఏ.ఎస్. అధికారి జతిన్ చంద్ర మహంతి స్థాపించిన కొత్త పార్టీ ఏది ?

9. భూమధ్యరేఖను 2 సార్లు దాటే నది ఏది?

10. వన్డేల్లో అత్యధిక అర్థ సెంచరీలు చేసిన బ్యాట్స్‌మన్ ఎవరు ?

**జవాబులు**

1. వెనిగళ్ళ కోమల
2. T.H.మాయిమాన్ (1960)
3. డేవిడ్ రోజెన్
4. సుమారు 6 అడుగులు
5. పరారుణ కిరణం
6. బెర్నోలీ ఎఫెక్ట్
7. చక్ దె ఇండియా
8. సమృద్ధి ఒరిస్సా పార్టీ
9. కాంగో
10. ఇంజమామ్ ఉలహక్ (83)

❖ ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణకు శ్రీ గురువాయిరప్పన్ చంబయ్ పురస్కారం లభించింది. బాలమురళీకృష్ణ 1930లో మన రాష్ట్రంలోని తూ.గో.జి.లో ఉన్న శంకర గుప్తంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు పట్టాభిరామయ్య, సూర్యకాంతమ్మలు.

❖ భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు 2006-07 సంవత్సరానికి గాను 'బసవ అవార్డు' లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఏటేటా కర్నాటక ప్రభుత్వం ఇస్తోంది. సుప్రసిద్ధ తత్వవేత్త బసవేశ్వరుని పేరుతో ఈ అవార్డును నెలకొల్పారు.

❖ ఇజ్రాయిల్‌కు చెందిన స్మార్ట్ బయోటిక్ అనే సంస్థ ఎయిడ్స్‌ను వేగంగా నిర్ధారించేందుకు కొత్త పరికరాన్ని 'స్మార్ట్‌ట్యూబ్'ను కనుగొన్నది.

❖ జన్యుశాస్త్రవేత్తలు ప్రఖ్యాత శాస్త్రవేత్త క్రెయింగ్‌లెంటర్ డి.ఎన్.ఏ పూర్తి చిత్రాన్ని సెప్టెంబర్ 4న ఆవిష్కరించారు. ఒక వ్యక్తి జన్యు క్రమాన్ని సంపూర్ణంగా విశ్లేషించడం ఇదే ప్రథమం. దీనిపై వెంటనే స్వయంగా రచించిన వ్యాసాన్ని ఆన్‌లైన్ జర్నల్ 'పి.ఎల్.ఓ.యస్ బయాలజీ' లో ఉంచారు.

❖ భారతదేశంపై, వేదాలపై పరిశోధన చేసిన ప్రముఖ రష్యా పండితురాలు తాతియానా ఎలిజార్ని కోవా (79) సెప్టెంబర్ 5న కన్ను మూశారు. భారత్‌పై చేసిన పరిశోధనలకు సేవలకు భారతప్రభుత్వం ఈమెకు 2004 సంవత్సరంలో పద్మశ్రీతో సత్కరించింది.

❖ జర్మనీలో జరిగిన 'అంతర్జాతీయ రుహ్ సైకత్ పోటీ'లో ఒరిస్సాకు చెందిన సుదర్శన్ పట్నాయక్‌కు ప్రథమ బహుమతి లభించింది. పట్నాయక్ వేసిన 15 అడుగుల సముద్ర రాజ శిల్పానికి ఈ బహుమతి లభించింది.